క్లుప్తంగా

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న హెచ్‌ఎం నాగార్జున, సిబ్బంది

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు జెడ్పీ హైస్కూల్‌లో బదిలీ ఉద్యోగులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల సాధారణ బదిలీలో భాగంగా 8 ఏళ్ల పూర్తి చేసుకొని బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు మాధవి, ప్రసూన, వెంకటరెడ్డి, రవికుమార్, తిప్పేస్వామి, జూనియర్ అసిస్టెంట్ కళ్యాణ్‌ను పాఠశాల సిబ్బంది సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు నాగార్జునుడు మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎంతో సహకరించారని పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కవిత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వర శాస్త్రి తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. అలాగే మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో పాటు కోఆప్షన్ మెంబర్, మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలన్నారు.

నిరుపయోగంగా ఎస్టీ హాస్టల్



నిరుపయోగంగా ఎస్టీ హాస్టల్ భవనం

పెనుకొండ: పట్టణంలోని ఎస్టీ హాస్టల్ భవనాలు నిరుపయోగంగా మారిపోయాయి. దశాబ్దాల పాటు వేలాది మంది గ్రామీణ నిరుపేద ఎస్టీ, ఎస్సీ విద్యార్థులకు ఇక్కడ తగిన వసతులు కల్పించి విద్య అందించారు. అయితే ప్రస్తుతం ఇక్కడున్న విద్యార్థులను ఎంజేపీ స్కూల్లో కలపడంతో గదులు ఖాళీ అయ్యాయి. దాదాపు ఇప్పటికి 8 సంవత్సరాలు కావస్తున్నా నిరుపయోగంగా ఉన్న ఈ వసతి గృహాలను అధికారులు పట్టించుకోలేదు. ఎంతో విలువైన భవనాలను నిరుపయోగంగా వదిలి వేయడం అధికారుల నిర్లక్ష్యమేనని స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారించండి

పావగడ: పట్టణంలోని తుమకూరు కేశిప్ రహదారిలో రోడ్డు ప్రమాదాలు పెరిగి పోతున్నాయని, ప్రమాదాల నివారణకు అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు వేసి రోడ్డు ప్రమాదాలను నివారించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ వరదరాజులుకు మున్సిపల్ కౌన్సిలర్ ఎంఏజీ మహ్మద్ ఇమ్రాన్ తదితరులు వినతిపత్రమిచ్చారు. స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బొరుగుల సీనప్ప, శివప్ప, రంగస్వామి, రామప్ప, అరుణ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లికి చెందిన రైతు అంజినాయక్‌కు చెందిన గడ్డివాము శుక్రవారం కాలిబూడిదైంది. ఆకతాయిలు నిప్పుపెట్టడంతోనే రూ.లక్ష నష్టపోయినట్లు అంజినాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపిక సిబ్బంది మంటలను అదుపు చేసినా అప్పటికే నష్టం జరిగిపోయిందన్నారు.

మానవీయ విలువలు బోధించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామి జపానంద

పావగడ: విద్యతో పాటు మానవీయ విలువలు బోధించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, సంస్కార వంతులుగా తీర్చిదిద్దాలని స్వామి జపానంద ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని బెస్కాం కార్యాలయం ఎదురుగా నిర్మించిన రాష్ట్ర ప్రగతి పాఠశాల నూతన భవనాన్ని స్వామి జపానంద ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రగతి విద్యా సంస్థ కార్యదర్శి సాగడు వెంకటేశ్, నాయకులు తిమ్మారెడ్డి, ఈరణ్ణ, బలరామరెడ్డి,మానం వెంకటస్వామి, పాఠశాల హెచ్ ఎం ఆనందప్ప పాల్గొన్నారు.

విద్యుత్ కేబుల్ చోరీ

రొళ్ల: మండల పరిధిలోని హెచ్‌టీ హళ్లిలో రైతులు ముద్దరంగప్ప గారి తిమ్మప్ప (వార్డు మెంబర్) చెందిన వ్యవసాయ బోరుబావికి అమర్చిన 45 మీటర్ల విద్యుత్ కేబుల్ గురువారం రాత్రి అపహరణకు గురైందని బాధిత రైతు వాపోయారు. దాదాపు రూ.7 వేలు నష్టం జరిగిందన్నారు. ఈ ఏడాదిలో మూడో సారి గుర్తు తెలియని వ్యక్తులు కేబుల్‌ను దొంగిలించుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై రొళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

కూటమి నేతల ఇసుక దందా

- చెరువులు, వాగులు, వంకల్లో ఇసుక తవ్వకాలు
- గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్న వైనం
- అన్ని తెలిసినా చోద్యం చూస్తున్న అధికారులు



కొంకల్లు చెరువు సమీపంలో ఇసుకను డంప్ చేసిన దృశ్యం



కొంకల్లు చెరువు ప్రాంతంలో జేసీబీతో టిప్పర్‌లోకి ఇసుకను లోడ్ చేస్తున్న దృశ్యం

గుడిబండ: మడకశిర నియోజకవర్గంలో కొందరు కూటమి నాయకులు ఇసుక దందాకు తెరలేపారు. చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, నదులు వేటినీ వదిలి పెట్టడం లేదు. ఇసుక సరఫరాను పకడ్బందీగా అమలు చేయండి.. అక్రమార్కుల భరతం పట్టండి అని ఓ వైపు కలెక్టర్ చేతన్‌తో పాటు ప్రభుత్వ ఉన్నాధికారులందరూ చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. మడకశిర నియోజకవర్గం కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దు కావడంతో చెరువులు, నదీ పరివాహక ప్రాంతాల నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమార్కులు ఇసుక తవ్వకాలను చేస్తున్నారు.

టిప్పర్ రూ.35 వేలకు విక్రయం

మడకశిర నియోజకవర్గంలోని గుడిబండ మండలంతో కొంకల్లు, గుడిబండ, మోరుబాగల్, ముతుకూరు, ఎస్ రాయపురం గ్రామాల్లోని చెరువులతో పాటు వివిధ ప్రాంతాల్లోని వాగులు, వంకల్లో ఇసుక తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. ఇసుకను ట్రాక్టర్లల సహాయంతో ఒక చోట నుంచి ఇసుకను డంప్ చేసుకుని టిప్పర్ లారీలకు జేసీబీ సహాయంతో లోడ్ చేసి గుట్టుచప్పుడు కాకుండా సమీపంలోని కర్ణాటక ప్రాంతానికి తరలిస్తున్నారు. కొంకల్లు పంచాయితీ పరిధిలో ఉన్న చెరువు నుంచి రోజూ 10 నుంచి 15 ట్రాక్టర్లలో ఇసుకను ఒకచోటకు తరలించి అక్కడి నుంచి కర్ణాటకకు యథేచ్ఛగా తీసుకెళ్తున్నారు. కర్ణాటక ప్రాంతంలో ఇసుక కొరత ఉండడంతో ఇక టిప్పర్ ఇసుక రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకూ విక్రయిస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్నతో పాటు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం వారి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాల అధికారులు, పోలీసు సిబ్బందికి ఇసుక రవాణా వ్యవహారాలన్నీ తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. కొంతమందితో లాలూచీపడి మామూళ్ల మత్తులో ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా మైనింగ్ అండ్ విజిలెన్స్ అధికారులతో పాటు ఉన్నతాధికారులు అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

స్థానిక నేతల కనుసన్నల్లోనే..

అధికార బలంతో పాటు బడా నాయకుల అండదండలతో కొందరు మండలస్థాయి కూటమి నాయకులు అక్రమాలకు పాల్పడుతూ ఇసుక తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని సంబంధిత అధికారులకు తెలియజేసిన పట్టించుకునేవారే కరువయ్యారని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ఇసుక తవ్వకాలు ఇలానే కొనసాగితే భూగర్భ జలాల నీటి మట్టం అడుగంటిపోయి ఈ ప్రాంతమంతా ఎడారిగా మారే అవకాశం ఎంతో దూరంలో లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

‘పురం’ తరలివెళ్లిన నాయకులు



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

లేపాక్షి: హిందూపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన పదవుల పట్టాభిషేకం కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షేక్ నిస్సార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. నాయకులు, కార్యకర్తలు ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పురానికి వాహనాల్లో తరలివెళ్లారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి

- సమన్వయకర్త ఈరలక్కప్ప



మరువపల్లిలో నాయకులతో సమావేశమైన ఈరలక్కప్ప

మడకశిరరూరల్: సమష్టిగా శ్రమించి వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేద్దామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ప్రజాప్రతినిధులు, వివిధ కమిటీల సభ్యులు, నాయకులతో కలిసి మరువపల్లి గ్రామాన్ని సందర్శించారు. అనంతరం పార్టీ బలోపేతం, ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ పార్టీలో ఎవరికీ ఏ సమస్య వచ్చినా కలిసికట్టుగా ఎదుర్కొందామన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొనే ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పని చేసిన వారి సేవలను గుర్తిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అరాచకం తప్ప ప్రజలకు చేసింది శూన్యమన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు తప్పుడు ఆరోపణ చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గిరీష్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు వైసీ గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ అనంతరాజు, మండల కన్వీనర్ రామిరెడ్డి, వివిధ కమిటీ విభాగాల అధ్యక్షులు శేషాద్రి, నరసింహ, మల్లికార్జున, నరేష్‌రెడ్డి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని స్నేహలతనగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీ నరసప్ప పదవీ విరమణ చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉపాధ్యాయులు ఘనంగా ఆయనను సత్కరించారు. విద్యాభివృద్ధికి ఆయన అందించిన సేవలు మరువలేనివి అని ఎంఈఓలు అంజినాయక్, ఆనంద్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎస్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాడి శెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కిష్టప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

అమరాపురం: మండల పరిధిలోని మద్దనకుంటకు చెందిన హనుమంతరాయప్ప, శాంతమ్మలు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా కర్ణాటక రాష్ట్రం లక్కనహళ్లి సమీపంలో అదుపు తప్పి గురువారం రాత్రి కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని బెంగళూరుకు తరలించారు. హనుమంతరాయప్ప పెయింటింగ్ పని చేసున్నాడని, పని నిమిత్తం వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

హిందూపురం టౌన్: పట్టణంలోని రహమత్‌పురంలోని జాకీర్ హుస్సేన్ మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, బెల్ట్, బూట్ల కిట్ పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ పాల్గొని విద్యార్థులకు కిట్లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గొల్లాలమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లిలో గొల్లాలమ్మ దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. మంజునాథ స్వగృహంలో అమ్మవారికి యాదవ కులస్తులు ప్రత్యేకంగా అభిషేకాలు, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

నేడు యోగా దినోత్సవం

లేపాక్షి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం ఆవరణలో పురావస్తు, ఆయుష్ శాఖల ఆధ్వర్యంలో శనివారం యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జెడ్పీ పాఠశాలలో కూడా యోగా దినోత్సవం జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, యోగా అభ్యాసకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

సాదాసీదాగా మండల మీట్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ కరుణాకర్‌గౌడు

గుడిబండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాధమ్మ అధ్యక్షతన శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై సర్పంచులు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. గ్రామాల్లో తాగునీటి బోరుబావులకు విద్యుత్ సమస్య అధికంగా ఉన్నా విద్యుత్ అధికారులు స్పందించకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందు ఎదుర్కొంటున్నారని సర్పంచులు, ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గత సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చినా సమస్యలు పరిష్కారం కాలేదని ప్రజా ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ కేశవరెడ్డి, ఈఓఆర్డీ నాగరాజునాయక్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై లోకాయుక్త దాడులు



రికార్డులు పరిశీలిస్తున్న లోకాయుక్త అధికారి

పావగడ: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై తుమకూరు జిల్లా లోకాయుక్త అధికారులు దాడులు నిర్వహించారు. శుక్రవారం ఉదయం కార్యాలయం తెరచిన వెంటనే లోకాయుక్త అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ నాగరాజు .. లోకా యుక్త అధికారులు అడిగిన రికార్డులు అందించారు. లోకాయుక్త సీఐ రవి రికార్డులు పరిశీలించారు. అయితే సబ్ రిజిస్ట్రార్ రాధమ్మ సెలవు మీద ఉన్న సమయంలో లోకా యుక్త అధికారులు దాడులు చేయడం వృథా అని స్థానికులు అభిప్రాయపడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయలపైన ఏక కాలంలో దాడులు నిర్వహించినట్లు లోకాయుక్త ఎస్‌ఐ రాజు తెలిపారు. ఈ సందర్భంగా రామాంజనేయ, రవికుమార్, చంద్రశేఖర్ తదితర బాధితులు సబ్ రిజిస్ట్రార్ రాధమ్మపై లోకాయుక్త అధికారులకు ఫిర్యాదు చేశారు. లంచం ఇస్తేనే పనులు త్వరితగతిన చేస్తున్నారని ఆరోపించారు. ఆమెను ఇక్కడి నుంచి వెంటనే బదిలీ చేయాలని కోరారు.

అన్ని వర్గాలకూ ‘కూటమి’ అన్యాయం

- మాజీ సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణ ఓర్వలేకనే విమర్శలు
- వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి



మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి



పదవులు పొందిన నాయకులను సత్కరించిన టీఎన్ దీపిక, వేణురెడ్డి



కాంగ్రెస్ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న నాయకులు

చిలమత్తూరు: ‘కూటమి ప్రభుత్వం సర్పంచుల సొమ్మును మింగేస్తుస్తోంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా పారిశుధ్యం లోపించింది. డబ్బులు లేక సర్పంచులు దివాళా తీసే పరిస్థితికి కూటమి ప్రభుత్వం తెస్తోంది’ అని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హిందూపురం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో ‘పదవుల పట్టాభిషేకం’ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఏడాదిగా సంక్షేమ పథకాలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘటన సీఎం చంద్రబాబుదేనన్నారు. సంక్షేమ సారథి అయిన మాజీ సీఎం వైఎస్ జగన్ ఎక్కడికి వెళ్లినా వస్తున్న ఆదరణ చూసి భరించలేక విమర్శించడం సిగ్గుచేటన్నారు. ప్రజల పక్షాన పోరాడాల్సిన పచ్చ పత్రికలు అప్పుడూ, ఇప్పుడూ చేస్తున్నది చంద్రబాబు భజనే అని చురకలంటించారు. రోడ్డు ప్రమాదంలో సింగయ్య అనే వ్యక్తి చనిపోతే రాజకీయం చేసిన పత్రికలకు విలువ ఉందా ? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూటమి వైఫల్యాలను ఎండగడదాం

నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేలా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక పిలుపునిచ్చారు. పాలనతో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పార్టీలో పదవులు పొందిన 200 మందికి పైగా సైనికులు గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలన్నారు. కూటమి నేతలు అరాచకాలను, దోపిడీలను ఎక్కడికక్కడ ఖండిస్తూ ముందుకు సాగాలన్నారు. ప్రతి కార్యకర్తకు తాను తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజల మనిషి అని, అందుకే ఆయన అడుగు పెట్టిన ప్రతిచోటా ప్రజలు వేలాదిగా తరలివస్తున్నారన్నారు. ఓర్చుకోలేకనే కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగుతోందన్నారు.

కాంగ్రెస్ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

లేపాక్షికి చెందిన ఏడు కుటుంబాలకు చెందిన కాంగ్రెస్ మద్దతుదారులు మాజీ మండల కన్వీనర్ గంగాధరప్ప ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి సమన్వయకర్త దీపిక కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి, మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, రాము, సయ్యద్ నిస్సార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫ్, జిల్లా అధికార ప్రతినిధి శివశంకర్‌రెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, హిందూపురం రూరల్ మండలం ఎంపీపీ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాల్వలు నిర్మించండి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక శిర రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలోని యువకులు కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ రామరావుకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో మురుగు కాల్వలు లేకపోవడంతో రోడ్డుపైన మురుగు పారుతోందని, వెంటనే మరుగు కాలువలను నిర్మించాలన్నారు.

తిరుమలకు నందిని నెయ్యి సరఫరా

పావగడ: తిరుమల తిరుపతి దేవాలయానికి కేఎంఎఫ్ నందిని నెయ్యి సరఫరా కార్యక్రమాన్ని తుముల్ అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నందిని నెయ్యితో నిండి ఉన్న మిల్క్ ట్యాంకర్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తుముల్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి, మహలింగయ్య, డి కృష్ణకుమార్, నాగేశ్ బాబు, ఎగువపల్లి నాని తదితర డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సదాశివనగర్, అహ్మద్‌నగర్, సత్యసాయినగర్, తెలుగుతల్లి సర్కిల్, బ్యాంకు కాలనీ, వన్నమ్మ కాలనీ, చౌడేశ్వరీ కాలనీ, మేళాపురం, మిలద్ నగర్, ఆర్టీసీ కాలనీ, చైతన్య నగర్, త్యాగరాజ్ నగర్, శాంతినగర్‌లలో 11 కేవీ లైన్ మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజలు, ప్రభుత్వానికి వారధి రెవెన్యూశాఖ



హిందూపురం : ర్యాలీలో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు



గోరంట్ల: అనాథాశ్రమంలో అన్నదానం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది



అమరాపురం: విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ నాగప్పను సన్మానిస్తున్న దృశ్యం

హిందూపురం: ప్రజలు ప్రభుత్వానికి వారధి రెవెన్యూశాఖననేని తహసీల్దార్ వెంకటేష్, డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్ అన్నారు. రెవెన్యూడే పురస్కరించుకుని శుక్రవారం హిందూపురం రెవెన్యూ ఉద్యోగులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు.

లేపాక్షి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవ వేడుకలను శుక్రవారం అధికారులు. రెవెన్యూ సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ దినోత్సవం నిర్వహించడం వలన శాఖ అందిస్తున్న సేవలపై ప్రజలందరికీ అవగాహన కల్పించేందుకు దోహదపడుతుందన్నారు.

పెనుకొండ రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రిటైర్డు తహసీల్దార్ నాగభూషణం, వీఆర్వో చలపతిలను సన్మానించారు. తహసీల్దార్ శ్రీధర్, డీటీ స్వాతి తదితరులు పాల్గొన్నారు

గుడిబండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డేని నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తి రెవిన్యూ సేవల ప్రాముఖ్యతను వివరించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ భూపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల రైతులు, ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, ఎఫ్‌పీ షాపుల డీలర్ల తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ షేక్షావలి, విశ్రాంత తహసీల్దార్ రంగప్ప, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది రెవిన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగులు చింతమానుపల్లి సమీపంలోని వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది జరుపుకున్నారు. విశ్రాంత డీటీ. నాగప్పను శాలువ పూలమాలలతో సన్మానించారు.

అగళి: ప్రజలకు రెవెన్యూ సేవలను సక్రమంగా అందించాలని స్థానిక తహసీల్దార్ సుబ్బరావు సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఐ చంద్రశేఖర్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే ను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ నటరాజ్, డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పదవీ విరమణ పొందిన తహసీల్దార్ జయరాములుతో పాటు పలువురిని సత్కరించారు.



చిలమత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు



అగళి: రెవెన్యూ దినోత్సవంలో పాల్గొన్న ఉద్యోగులు



రిటైర్డ్ తహసీల్దార్ నాగభూషణంను సన్మానిస్తున్న దృశ్యం